నెత్తిన నిప్పుల కుంపటి..

- తారెత్తిస్తున్న రోహిణీ కార్తె
- ఎండలతో అల్లాడుతున్న జనం
- నిర్మానుష్యంగా రహదారులు

తాళ్లరేవు: రోహిణీ కార్తెలో రోళ్లు బద్దలవుతాయనేది నానుడి. దీనిని నిజం చేసేలా భానుడు తారెత్తిస్తున్నాడు. ఈ ఏడాది రోహిణి కార్తె ప్రారంభంలో రెమాల్ తుపాను ప్రభావంతో అంతగా ఎండలు లేనప్పటికీ నాలుగు రోజుల నుంచి తారాస్థాయికి చేరింది. భానుడి ఉగ్రరూపానికి అందరిలో దడ పుడుతోంది. ఎండల తీవ్రత కారణంగా జనం అల్లాడిపోతున్నారు. ఇంటా, బయట నిప్పుల కొలిమిగా మారుతోంది. ఈ వాతావరణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో నాలుగు రోజులుగా 42 నుంచి 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. సూర్యోదయం ప్రారంభం నుంచే ప్రచండ భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. జనం ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. ఉష్ణోగ్రతలకు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అంతా చెమటలు కక్కుతున్నారు. 10 గంటల నుంచే రోడ్లు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. భానుడి ప్రతాపం రోజురోజుకూ ఎక్కువ కావడంతో జనం ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు సైతం మధ్యాహ్నం దుకాణాలు మూసివేసి ఇంటికే పరిమితం అవుతున్నారు. మండల పరిధిలో నిత్యం రద్దీగా ఉండే తాళ్లరేవు



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్

సంతపేట సెంటర్, చెరువుగట్టు సెంటర్, దేవీమహల్ సెంటర్, సుంకరపాలెం జంక్షన్ తదితర రహదారులు జనం లేక వెలవెలబోతున్నాయి. జాతీయ రహదారి 216లో సైతం జన సంచారం ఉండడం లేదు. సాయంత్రం ఐదు గంటలు దాటినా ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సాయంత్రం ఆరు దాటినా వేడి గాలులు మాత్రం తగ్గకపోవడంతో జనం ఆపసోపాలు పడుతున్నారు. వ్యవసాయ పనులకు వెళుతున్న రైతులు తెల్లవారుజామునే వెళ్లి త్వరగా పనులు ముగించుకుని ఇంటికి చేరుకుంటున్నారు. గాలి వేడిగా ఉండడం, అధిక మొత్తంలో చెమట పట్టడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవి తాపాన్ని తట్టుకోలేక ఏసీలను, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు వస్తాయని



జనం లేక వెలవెలబోతున్న సుంకరపాలెంలోని యానాం- ద్రాక్షారామ రహదారి

వాతావరణ శాఖ చెప్పడంతో జనం ఆశగా ఎదురు చూస్తున్నారు. కాగా వేసవి తాపాన్ని తగ్గించుకునేందుకు జనం శీతల పానీయాలను తాగుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, గొడుగు, ముఖానికి మాస్కులు ధరించి వెళ్లాలని సూచిస్తున్నారు. రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినరాదని, అలాగే చల్లని రంగు పానీయాలు తాగరాదని చెబుతున్నారు. ప్రస్తుత వాతావరణం కారణంగా ఇటువంటి పదార్థాలు తీసుకోవడం ద్వారా డయేరియా (విరోచనాలు) తదితర వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి



ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలి. ఎండలో అధికంగా తిరగడం ద్వారా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. కలుషిత నీరు, ఆహారం, రంగురంగుల పానీయాలు తాగడం మంచిదికాదు. దీనిద్వారా డయేరియా వంటి వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ రోజుకు సుమారు 10 నుంచి 15 గ్లాసులకు పైగా నీటిని తాగాలి. అలాగే పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లతోపాటు చల్లటి మజ్జిగ, బార్లీ తదితర పానీయాలను అధికంగా తీసుకోవాలి.

–ఈశ్వర్, పీహెచ్‌సీ వైద్యుడు, తాళ్లరేవు మండలం

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



అయ్యప్ప స్వామివారు

అమలాపురం రూరల్: ఈదరపల్లి బైపాస్ రోడ్డులోని కోనసీమ మహా శాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో 17వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నటరాజ్ గురుస్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. భక్తురాలు గుర్రం విరజచే కాల భైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. స్వామివారికి దాతల సహకారంతో 60 గ్రాముల బంగారు హారం చేయించారు. నటరాజ్ గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష చేపడితే సకల శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ నిర్మాత మోరం దొరబాబు, కమిటీ సభ్యులు వి.పుల్లయ్యనాయుడు, రామాయణం వెంకటేశ్వరరావు, కొప్పుల శ్రీను, కడలి సత్యనారాయణ, చాగంటి ప్రసాద్, టి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెంకన్న స్వామికి మధుర ఫలాలతో అభిషేకం



వేంకటేశ్వరస్వామికి 1,116 మామిడి పండ్లతో అభిషేకం చేస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శుక్రవారం 1,116 మామిడి పండ్లతో అభిషేకం జరిగింది. పట్టణానికి చెందిన కిరాణా హోల్‌సేల్ వ్యాపారి రేపాక సత్యనారాయణచే మామిడి పండ్ల అభిషేకం కన్నుల పండువగా సాగింది. గతంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తగా సత్యనారాయణ పనిచేశారు. ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, వివిధ వ్యాపార సంఘాలకు చెందిన ప్రతినిధులు ఈ అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈఓ దూనబోయిన సాయిబాబు, అర్చకుల సమక్షంలో ఈ మామిడి పండ్ల అభిషేకం జరిగింది.

జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని..



గౌరీపట్నం నిర్మలగిరి కొండపైకి మోకాళ్లపై నడిచి వెళ్తున్న మణికంఠ

తాళ్లరేవు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ తాళ్లరేవుకు చెందిన ఒక అభిమాని నిర్మలగిరి కొండపైకి మోకాళ్లపై నడిచి వెళ్లాడు. తాళ్లరేవుకు చెందిన పిల్లి మణికంఠ సచివాలయం-1 వైఎస్సార్ సీపీ కన్వీనర్‌గా పనిచేస్తున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా గౌరీపట్నంలోని నిర్మలగిరి కొండపైకి మెట్లపైకి మోకాళ్లపై ఎక్కి మళ్లీ జగన్‌ను సీఎంగా, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను మంత్రిగా చూడాలని దేవుడిని కోరుకున్నట్లు మణికంఠ తెలిపారు.

మహాయజ్ఞం విజయవంతం చేయండి



పారాయణ గురించి వివరిస్తున్న ఆధ్యాత్మికవేత్త కుమార్‌శంకర్ గౌడ్

అమలాపురం రూరల్: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ వచ్చే నెల 2న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అమలాపురం మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న సహస్రగళ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం విజయవంతం చేయాలని ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్‌శంకర్ గౌడ్ అన్నారు. అమలాపురం రూరల్ నల్లమిల్లిలోని అప్పారివారిపాలెం, కొంకాపల్లిలో భక్తజనంతో కలసి శుక్రవారం నిర్వహించిన సత్సంగాలలో కుమార్‌శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సామూహిక పారాయణతో మనుష్యుల మధ్య అంతరాలు తొలగుతాయన్నారు. హనుమంతుని కృపతో జీవితం సుఖమయం అవుతుందన్నారు. గొవ్వాల అచ్యుతరామయ్య, రమణాతి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి



గొల్లవిల్లిలో మధ్యాహ్న భోజన పథక సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సీఎంఓ సుబ్రహ్మణ్యం

ఉప్పలగుప్తం: మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సమగ్రశిక్షా సీఎంఓ బీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథక సిబ్బందికి వైద్య సిబ్బందితో కలసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. ఆ వంటకాలను రుచికరంగా, శుభ్రంగా తయారు చేస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. మెనూ ప్రకారం ఇచ్చిన వంటకాలను ఏ విధంగా చేయాలో నిపుణులచే వివరించారు. ఎమ్ఈఓలు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ, పీహెచ్‌సీ సీహెచ్ఓ విజయలక్ష్మి, సీఆర్పీలు పాల్గొన్నారు.

రవాణా శాఖలో ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలి



ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులతో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్

యానాం: యానాం రవాణా శాఖలో శాశ్వత ప్రాతిపదికన మోటార్ వాహనాల తనిఖీ అధికారిని నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆర్‌ఏఓ మునిస్వామిని కోరారు. శుక్రవారం ఆయన ఆర్‌ఏఓ ఛాంబర్‌లో పలు ప్రజా సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో సెంటాక్, నీట్ తదితర కోర్సులకు కౌన్సెలింగ్ కోసం వెళ్లే విద్యార్థులకు కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాల జారీ ఆలస్యం అవుతుందని పలు ఫిర్యాదులు వచ్చాయని ఎమ్మెల్యే అన్నారు. ధ్రువపత్రాలను త్వరితగతిన జారీ చేయాలని ఆదేశించారు. కొన్నేళ్లుగా మోటార్ వాహనాల తనిఖీ అధికారి నియామకం జరగకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాహనాల రిజిస్ట్రేషన్, లైసెన్స్‌ల జారీ తదితర ప్రక్రియలు నిలిచిపోతున్నాయన్నారు. అదేవిధంగా ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే ల్యాడ్ నిధుల ద్వారా శంకుస్థాపనలు చేసిన పనులు ఆలస్యమవుతున్నాయని, పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యపై మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి పూర్తి చేయాలని కోరారు. వివాహాలు చేసుకున్న వారికి సోషల్ వెల్ఫేర్ ద్వారా అందాల్సిన వివాహ సహాయం త్వరితగతిన అందించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ దండాయుతపాణి, వీఏఓ రషీద్, సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలలకు వినోదం, విజ్ఞానం అవసరం

యానాం: వేసవి సెలవుల్లో బాలలకు వినోదంతో కూడిన విజ్ఞానాన్ని అందించాలన్న తలంపుతో బాలల వేసవి వినోద కేంద్రాన్ని ప్రారంభించినట్లు జనవిజ్ఞాన వేదిక యానాం శాఖ గౌరవాధ్యక్షుడు, కవి దాట్ల దేవదానంరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక మెట్టకూరు మదర్ థెరిసా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జూన్ 5 వరకూ నిర్వహించే ఈ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమం జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. వేసవి సెలవులను బాలలు సద్వినియోగం చేసుకునేలా మెట్టకూరు పాఠశాలలో వేసవి వినోద కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై హెచ్ఎం పీవీ రమణ హర్షం వ్యక్తం చేశారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజామొహిద్దీన్ మాట్లాడుతూ జ్యోతిషం, మంత్రాలు బూటకమని వాటిని నమ్మి మోసపోవద్దన్నారు. అనంతరం కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన ఇంద్రజాలకుడు



యానాంలో బాలల వేసవి వినోద కేంద్రంలో మాట్లాడుతున్న వక్తలు

ఎం.పాపారావు మాట్లాడుతూ మూఢనమ్మకాలు నమ్మవద్దని, ప్రతిదానికి శాస్త్రీయత ఉంటుందని చెబుతూ అనేక అంశాలను ప్రదర్శించారు. యానాం శాఖ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు, జిల్లా నాయకులు రమణ, టీచర్స్ నాగరాజు, శ్రీరామ్, ప్రజా సంఘాల నాయకులు దుర్గాప్రసాద్, కుంచే సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంయమనం పాటించాలి

అమలాపురం టౌన్: ఓట్ల లెక్కింపు రోజున ప్రజలంతా సంయమనం పాటించాలని పట్టణ సీఐ కె.క్రిస్టోఫర్ విజ్ఞప్తి చేశారు. కౌంటింగ్ రోజున పోలీసులు నిర్వహించే బందోబస్తు, పెట్రోలింగ్ తదితర అంశాలపై పేరూరులో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో సీఐ వివరించారు. గ్రామంలోని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించి ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తే అవకాశాలు ఉన్నా, అపరిచిత వ్యక్తులు వచ్చి గలాటాకు కాలు దువ్వుతున్నా ఆ సమాచారాన్ని తక్షణమే



పేరూరు సదస్సులో మాట్లాడుతున్న పట్టణ సీఐ క్రిస్టోఫర్

పోలీసులకు అందించాలని సీఐ విజ్ఞప్తి చేశారు. తర్వాత పట్టణ ఎస్సై కిశోర్‌బాబు మాట్లాడారు.

సేవలు అభినందనీయం

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయ కంట్రోల్ రూమ్‌లో ఎస్సైగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వి.సోమేశ్వరరావు సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఈ సత్కారం జరిగింది. పోలీసు శాఖలో 42 ఏళ్లుగా ఆయన వివిధ పోస్టుల్లో సేవలు అందించారని ఎస్పీ శ్రీధర్ అన్నారు. అనంతరం సోమేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఎస్పీ కార్యాలయ స్పెషల్ బ్రాంచ్ సీఐ బి.రాజశేఖర్, డీసీఆర్‌బీ సీఐ ఎం.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సై సోమేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ శ్రీధర్

ఉద్యోగ విరమణ సత్కారాలు

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అసిస్టెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పెసల వీరగణపతిరావును సిబ్బంది సత్కరించారు. అలాగే కో ఆపరేటివ్ స్టోర్స్‌లో డ్రైవర్‌గా సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన పొన్నాల దేవప్రసాద్‌ను ఆ సిబ్బంది సన్మానించారు. విద్యుత్‌శాఖ ఉద్యోగి అనిమిల్లి సత్యనారాయణ మూర్తిని ఏతఅ లంక కృష్ణారావు, అలాగే మున్సిపాలిటీ సిబ్బంది పెట్టా సత్యనారాయణ, బుంగా శంకరరావును మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ సత్కరించారు.

ఆగని పేకాట క్లబ్ కార్యకలాపాలు

యానాం: యానాంలో రిక్రియేషన్ క్లబ్ పేరిట రూ.లక్షలు చేతులు మారుతూ పేకాటక్లబ్ నిర్వహిస్తున్న సంస్థకు గురువారం రాత్రి యానాం టౌన్ ప్లానింగ్ అథారిటీ నోటీసులు జారీ చేసింది. మరోవైపు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా, వాటిని పట్టించుకోకుండా శుక్రవారం సైతం క్లబ్ కార్యకలాపాలు యథేచ్ఛగా నిర్వహించడం విశేషం. మూతపడిన మెట్టకూరు రైస్‌మిల్లును ఆధునీకరించి అక్కడ గుడ్‌లక్ రిక్రియేషన్ అండ్ కల్చరల్ అసోసియేషన్ పేరు మీద పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారు. యానాం పరిసర ప్రాంతాలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, కృష్ణా, గుంటూరు తదితర జిల్లాల నుంచి ఖరీదైన కార్లలో వచ్చి వందల మంది పేకాటాడుతున్నారు. రోజుకు అనేక బోర్డుల ద్వారా రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. దీనిలోనే విలాసవంతమైన రీతిలో



పేకాట క్లబ్ నడుపుతున్న రైస్‌మిల్లు వద్ద గేటుకు నోటీసులు అతికిస్తున్న ప్లానింగ్ అథారిటీ అధికారులు

పేకాటరాయుళ్లు దేనికీ బయటకు వెళ్లకుండా వివిధ ఏర్పాట్లను నిర్వాహకులు చేశారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తూతూమంత్రంగా నోటీసులు వచ్చి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు వస్తున్నాయి. పోలీస్ స్టేషన్‌కు పదిమీటర్ల దూరంలో ఈ క్లబ్ కార్యకలాపాలు జరుగుతుండడం విశేషం.

క్లబ్‌కు అనుమతి లేదు

మెట్టకూరులో మూతపడిన పద్మబాలాజీ రైస్‌మిల్లులో రిక్రియేషన్ క్లబ్‌కు అనుమతి లేదని, దీనిని పూర్తి వ్యాపార దృక్పథంతో నడుపుతున్నారని తమ పరిశీలనలో గుర్తించినట్లు యానాం ప్లానింగ్ అథారిటీ మెంబర్ సెక్రటరీ నాయక్ నోటీసులో తెలిపారు. పుదుచ్చేరి బిల్డింగ్ బైలాస్‌కు విరుద్ధంగా ఇక్కడ కార్యాకలాపాలు జరుగుతున్నాయని, నోటీసు సైతం ఇచ్చామన్నారు. అదేవిధంగా సూర్య సొసైటీ ఫర్ సోషల్ వెల్ఫేర్ సంస్థకు నోటీసులు ఇచ్చామని అన్నారు. ఇప్పటికైనా నిలుపుదల చేయకపోతే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

అత్యవసర పనులకు ప్రాధాన్యం ఇవ్వండి

కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ ప్రవీణ్

ముమ్మిడివరం: వచ్చే వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అత్యవసర పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక నగర పంచాయతీ సమావేశ మందిరంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ త్వరలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున శానిటేషన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కౌన్సిల్‌లో కేవలం శానిటేషన్, తాగునీటి సరఫరాపై చర్చించి సమావేశాన్ని ముగించారు. ప్రత్యేక శానిటేషన్ నిర్వహణలో భాగంగా బ్లీచింగ్, దోమల నివారణ మందులు, ముగ్గు కొనుగోలుకు రూ.2 లక్షలు, తాగునీటి సరఫరాకు పైప్‌లైన్ల నిర్వహణ, మోటార్ పైపుల లీకులు, మరమ్మతులకు రూ.లక్ష



సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్

నగర పంచాయతీ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. తొలుత నాలుగో వార్డు కౌన్సిలర్ శ్రీనివాసరావు భార్య ఆ వార్డు వలంటీర్ వెంకటలక్ష్మి ఆకస్మిక మృతికి సమావేశం సంతాపం వ్యక్తం చేసింది. కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి, వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు తదితరులు పాల్గొన్నారు.

సినీ హీరో కృష్ణకు ఘన నివాళి

అమలాపురం టౌన్: సినీ హీరో కృష్ణ జయంతి వేడుకలను అమలాపురంలో ఆయన అభిమానులు శుక్రవారం నిర్వహించారు. స్థానిక రమా థియేటర్ ఆవరణలో పట్టణ కృష్ణ, మహేష్‌బాబు అభిమాన సంఘాల అధ్యక్షుడు కొప్పిశెట్టి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. తొలుత కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. అభిమాన సంఘాల గౌరవాధ్యక్షుడు చొల్లంగి రామకృష్ణ, సంఘాల ప్రతినిధులు కొప్పాడి రమేష్‌బాబు, కాశే గోవింద్, దొమ్మేటి శ్రీను, పాటి రవి, రాయుడు శ్రీను, కనక సాంబయ్య తదితరుల సమక్షంలో కేక్ కట్ చేసి ప్రేక్షకులకు స్వీట్లు పంచారు.



హీరో కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమాన సంఘాల ప్రతినిధులు

సమస్యలు పరిష్కరించాలి

తాళ్లరేవు: ఉపాధి హామీ పథకంలో వేతనదారుల సమస్యలను పరిష్కరించాలని, కనీస వేతనం రూ.300 ప్రతి కార్మికుడికి వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు కోరారు. శుక్రవారం ఆయన చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, పాతకోరంగి గ్రామాల్లో సంఘ జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వరరావుతో కలసి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దుప్పి అదృష్టదీపుడు, మందనక్క తణుకురాజు తదితరులు ఉన్నారు.

వైభవంగా తిరుచ్చి సేవ



బందారులంకలో వేంకటేశ్వరస్వామికి తిరుచ్చి సేవ

అమలాపురం రూరల్: బందారులంక బిళ్లవారి వీధిలో వేంచేసి ఉన్న పద్మావతి, అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా తిరుచ్చి సేవ నిర్వహించారు. తిరుచ్చి పల్లకిపై స్వామి, అమ్మవార్లను ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. వేదపారాయణ, కోలాటాలు, భజనలతో 300 మంది మహిళలు వెంట సాగారు. దారి పొడవునా భక్తులు స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులు ఇచ్చారు. అన్నదాన మహిళా సేవా సమితి సభ్యులు ఏకరూప చీరలు ధరించి పాల్గొన్నారు. అమలాపురం కేశవ భజన మండలి సభ్యురాలు రత్నమాల ఆధ్వర్యంలో కోలాటం, బందారులంక రామభజన మండలి వారిచే కోలాటం, బందారులంక పాండురంగ విఠల భజన సమాజం, నల్లచెరువు ఇస్కాన్ భజన బృందంచే భజనలు, అమలాపురం ఆర్ట్ ఫ్యామిలీ విద్యార్థుల కోలాటం, అన్నమయ్య కీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత ఆలయ అర్చకుడు భీరక భీమేశ్వరరావు అర్చకత్వంలో బట్టా గణేష్, శ్రీదేవి దంపతులచే స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. ఎంపీటీసీ అంకం హిమ భారతి, బి.లక్ష్మీకుమారి, ఉప్పుగంటి సూర్య నాగ లక్ష్మీకుమారి, లక్కింశెట్టి మోహిని, బళ్ల భవాని, బ్రహ్మ కారుపర్తి మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు టీకాలు

అల్లవరం: గొర్రెలు, మేకల్లో వచ్చే చిటుక వ్యాధి పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ ఏడీ విజయారెడ్డి అన్నారు. కోడూరుపాడులో పశు వైద్యాధికారి మేడిద నారాయణరావు ఆధ్వర్యంలో చిటుక వ్యాధి నివారణకు టీకాల వేసే కార్యక్రమాన్ని ఏడీ విజయారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాలు, పచ్చిక బయళ్లలో సన్న జీవాలను మేయడం వల్ల పశువులకు ఈ వ్యాధి వస్తుందన్నారు. దీని నివారణకు టీకాలే పరిష్కారమన్నారు. రైతులు సీహెచ్ వీరబాబు, శ్రీను, సూరిబాబు, పశు సంవర్ధక సహాయకులు శివ, రాజేష్ పాల్గొన్నారు.

దొమ్మేటిపేటలో భూ వివాదం

యానాం: యానాం నియోజకవర్గ శివారు దొమ్మేటిపేటలో భూ వివాదం నేపథ్యంలో శుక్రవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ రేగడంతో పోలీసులు రంగప్రవేశం చేసి పనులను నిలుపుదల చేయించారు. దొమ్మేటిపేట ఐస్ ఫ్యాక్టరీ ఎదురుగా సుమారు ఐదెకరాల భూమికి సంబంధిత యజమానులు తనకు నాలుగేళ్ల కిందట అగ్రిమెంట్ రాశారని, ఇటీవల తనకు తెలియకుండా మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని, ఆ ప్రాంతంలో చెరువులు తవ్వుతున్నారని తనకు అన్యాయం జరిగిందని నల్లా వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ షణ్ముగం, ఎస్సై మురుగానందం, డిప్యూటీ తహసీల్దార్ దండయుతపాణి, గ్రామ పెద్దలు తదితరులు ఘటనా స్థలికి వచ్చి భూమికి సంబంధించి వివాదం ఉండటంతో చెరువు పనులు నిలుపుదల చేయాలని ఆదేశించారు.

ఇసుక నిల్వల సీజ్



ర్యాంపుల వద్ద ఇసుక గుట్టలను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

తాళ్లరేవు: ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఇటీవల కలెక్టర్ జె.నివాస్ హెచ్చరికలు చేసినా, పలువురు అక్రమార్కులు వాటిని బేఖాతర్ చేస్తున్నారు. యానాం, ఆంధ్రా ప్రాంత సరిహద్దులో కొంతమంది జోరుగా ఇసుకను తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో పడవలపై ఇసుకను తీసుకువచ్చి నిల్వ చేస్తున్నారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవితేజ బృందం తనిఖీలు నిర్వహించగా, మూడు పడవల నుంచి తెచ్చిన ఇసుకను అరటికాయలంక వద్ద గుర్తించారు. ఆ ఇసుకను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.